క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణలో త్ర్యంబకేశ్వరుడు


త్ర్యంబకేశ్వరస్వామి

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఆర్టీసీ కాలనీలో పార్వతీ సమేత త్ర్యంబకేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారు గురువారం భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయంలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేక సహిత లక్ష బిల్వార్చన నిర్వహించారు. అర్చకుడు చైతన్య బృందం పూజలు నిర్వహించారు. అనంతరం గురువారం భక్తుల దర్శనార్థం ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఇంటి నందిబాబు, రాజబాబు, భక్తులు ఏర్పాట్లు చేశారు.

'జల్ జీవన్' లక్ష్యాలను నెరవేర్చాలి

బోట్‌క్లబ్: జల్ జీవన్ మిషన్ లక్ష్యాలను నెరవేర్చాలని జిల్లా బీజేపీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ అన్నారు. స్థానిక డీపీఓ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు ఈ మేరకు ధర్నా చేశారు. 2024 నాటికి గ్రామీణ ప్రాంతాల్లో అందరికీ తాగునీరు లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. పార్టీ నాయకులు రంభాల వేంకటేశ్వరావు, నందూరి సత్తిబాబు, తుమ్మలపల్లి నారాయణ రావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటిద్దాం


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

బాలాజీచెరువు: ట్రాఫిక్ నియమాలు పాటిద్దాం.. అందరి ప్రాణాలు కాపాడుదాం అంటూ శ్రీచైతన్య విద్యార్థులు గురువారం నగర ప్రధాన రహదారుల్లో ర్యాలీ చేపట్టారు. స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా సర్పవరం టెక్నో పాఠశాల విద్యార్థులు ఏజీఎం సురేష్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియమాలు వివరించారు. ముఖ్య అతిథులుగా ట్రాఫిక్ సీఐ చైతన్యకృష్ణ, ఎస్ఐ రత్నం హాజరై విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించి వారికి ముందుగా ట్రాఫిక్ రూల్స్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ గోపీనాథ్, పాఠశాల ప్రిన్సిపాల్ లలిత భ్రమరాంబ, డీన్ నాగేశ్వరరావు, ఇన్‌చార్జి రాయుడు పాల్గొన్నారు.

సహాయక చర్యలు చేపట్టాలి

బాలాజీచెరువు: కరవు ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డేగ ప్రభాకరరావు డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా పార్టీ విస్తృత స్థాయి సమావేశం గురువారం ఎస్టీయూభవన్‌లో నిర్వహించారు. ఈ నెల 21, 22 తేదీల్లో విజయవాడలో నిర్వహించే 30 గంటల నిరసన దీక్ష విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, పి.సత్యనారాయణ, కె.అప్పలరాజు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్‌కు సాయి శరణ్య


సాయి శరణ్యను అభినందిస్తున్న ఏజీఎం సురేష్ తదితరులు

బాలాజీచెరువు: జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు కాకినాడ శ్రీచైతన్య ఐసీఎల్ బ్రాంచ్ ఏడో తరగతి విద్యార్థి సాయి శరణ్య ఎంపికైంది. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థినిని పాఠశాల ఏజీఎం సురేష్, ప్రిన్సిపాల్ సుల్తానా, ఆర్ఐ గోపీనాథ్‌లు అభినందించి జాతీయ స్థాయిలో ప్రతిభ చూపి మంచి పేరు ప్రఖ్యాతలు సాధించాలని కోరారు.

బ్యాంక్ ఉద్యోగాలు భర్తీ చేయాలి

బాలాజీచెరువు: ప్రభుత్వ రంగానికి చెందిన 12 బ్యాంకులు, 7 ప్రైవేట్ రంగ బ్యాంకులలో ఉన్న 2 లక్షల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని ఆల్ ఇండియ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోషియేషన్ గురువారం రాత్రి నిరసన తెలిపింది. మెయిన్ రోడ్డులోని యూనియన్ బ్యాంక్ ప్రధాన కార్యాలయం వద్ద అసోషియేషన్ పిలుపు మేరకు నిరసన చేపట్టి బ్యాంకింగ్ రంగంలో ఔట్ సోర్సింగ్ విధానాన్ని నిలిపివేయాలని నినాదాలు చేసారు. బ్యాంక్ ఎంప్లాయిస్ కో–ఆర్డినేషన్ కమిటీ కార్యదర్శి కర్రి ఆదినారాయణ, బ్యాంక్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర కమిటీ చైర్మన్ పి.అరుణ, శ్యామ్‌కుమార్, మురళీకృష్ణ పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన నాయకుల ప్రచారం

కరప: మండలం సిరిపురంలో గురువారం టీడీపీ, జనసేన నాయకులు మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి ఇంటింటికీ తిరిగి ఉమ్మడి మేనిఫెస్టోను పంచారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఇరు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

గడప గడపలో సంతృప్తి

- గ్రామాల రాత మార్చిన జీజీఎంపీ
- ఏడాదిన్నరగా ప్రజలతో ఎమ్మెల్యే కన్నబాబు మమేకం
- సంక్షేమాన్ని వివరిస్తూనే సమస్యల పరిష్కారానికి చర్యలు
- నాటికీ నేటికీ బేరీజు వేసుకుంటున్న ప్రజలు


కాకినాడ అర్బన్ ఒకటో డివిజన్‌లో గడప గడపకూ నిర్వహిస్తూ మీ అభిమానానికి కృతజ్ఞుడిని తల్లీ అని అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు (ఫైల్)

కాకినాడ రూరల్: పాలించే రాజు ప్రజల పక్షాన నిలిస్తే వారి శ్రేయస్సుకు, సంక్షేమానికి లోటుండదు. నాలుగున్నర ఏళ్ల పాలనలో నవరత్న పథకాలు అందిస్తూ సంక్షేమ సునామీ సృష్టించారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగిస్తున్నారు. చెప్తే.. చేస్తారని పేరొందిన సీఎం జగన్ ఎన్నికల వాగ్దానాలన్నింటినీ నెరవేర్చారు. దీంతో మళ్లీ జగనే సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఏనాడూ ఒకటో తేదీనే పింఛన్ అందుకోని అవ్వతాతలు ఇప్పుడు వారి ఇంటి వద్దే వలంటీర్లు పింఛన్ అందిస్తుండడంతో మా బిడ్డ జగన్ చల్లగా ఉండాలని కోరుకుంటున్నారు. అక్కా చెల్లెమ్మల ఖాతాల్లో నేరుగా సొమ్ములు వేసిన జగనన్నకు మహిళలు సలామ్ కొడుతున్నారు. ప్రభుత్వం నుంచి ప్రజలకు అందించిన లబ్ధిని తెలియజేసే లక్ష్యంతో అధికారులతో కలిసి ప్రజా ప్రతినిధులు 'గడప గడపకూ మన ప్రభుత్వం' (జీజీఎంపీ) చేపట్టారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే కన్నబాబు గత ఏడాది మే 11న తూర్పు సెంటిమెంట్‌గా నేమాంలోని శివాలయంలో పూజలతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన కన్నబాబు రూరల్ మండలంలో బుధవారం రాత్రి గంగనాపల్లి సచివాలయం–1 పరిధిలో ఈ కార్యక్రమాన్ని ముగించారు. గడప గడపకూ తిరిగి వారికి అందిన పథకాలను వివరించి, ఇంకా సమస్యలు ఉంటే తెలుసుకుని వాటి పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలిచ్చి అభివృద్ధికి బాటలు వేశారు. నియోజకవర్గంలో తొలుత ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున తరువాత మరో విడతగా మరో రూ.20 లక్షలు కలిపి రూ.40లక్షల మంజూరయ్యాయి. మండలంలో మొత్తం 41 సచివాలయాలకు ఆ లెక్కన రూ.16.40 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి. నాడు–నేడు అన్నట్టు గత ప్రభుత్వంలోని దుస్థితితో నేటి అభివృద్ధిని పోల్చుకుంటూ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


వలసపాకలలో నిర్మించిన సిమెంట్ రోడ్డు

> **ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలా..**
>
> పేదల పక్షాన నిలచిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పనిచేయడం గర్వంగా ఉంది. అర్హతే ప్రమాణికంగా పేదలకు పథకాలు వర్తింపజేశాం. ఆ లబ్ధిని తెలియజేసేందుకు గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తూ ఒకటి రెండు సచివాలయాలు మినహా నియోజకవర్గంలో ఈ కార్యక్రమం ముగిసింది. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేశాం. నాలుగున్నర ఏళ్ల పాలన సంతృప్తిగా ఉంది. డ్రైనేజీ, రోడ్ల వంటి సమస్యలను గడప గడపకూ నిధులతో పూర్తిచేశాం. ఇదో నవశకం. సంక్షేమ పథకాలు అందించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పక్షాన ప్రజలు అండగా ఉన్నారు.
>
> – కురసాల కన్నబాబు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే, కాకినాడ రూరల్

అంతా ఐకమత్యంగా ఉండాలి


గ్రామసభలో మాట్లాడుతున్న రూరల్ సీఐ శ్రీనివాస్

కరప: గ్రామంలో ఎవరు ఏ పార్టీ వారైనా, మతం వారైనా, కులం వారైనా అంతా ఒక్కటేనన్న భావంతో ఐకమత్యంగా ఉంటే శాంతి భద్రతలు బాగుంటాయని సీఐ కె.శ్రీనివాస్ పేర్కొన్నారు. విలేజ్ విజిట్‌లో భాగంగా గురువారం మండలం గొర్రిపూడిలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కుల పెద్దలు, విద్యార్థులు, యువకులతో గ్రామసభ నిర్వహించి ఒకరికొకరు సాయం చేసుకుంటూ, సోదరభావంతో ఉండాలన్నారు. వచ్చే ఎన్నికల్లో వర్గవైషమ్యాలు విడనాడి, ఎవరి పార్టీకి వారు పనిచేసుకోవాలన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. వైస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చీకాల సుబ్బారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు చీకాల అప్పలరాజు, మాజీ సర్పంచ్ ఓలేటి సూర్యనారాయణ, గండి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దళారీ రహితంగా సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- పథకాల ప్రచార బోర్డు ఆవిష్కరణ
- పాల్గొన్న ఎమ్మెల్సీ పద్మశ్రీ, అధికారులు


సంక్షేమ పథకాల లబ్ధి ప్రచార బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: దళారీ వ్యవస్థకు దూరంగా అర్హులందరికీ సంక్షేమ లబ్ధిని నేరుగా ఖాతాల్లో జమ చేస్తున్నది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక గాంధీ నగర్ పార్క్ సమీపంలో 37, 38 డివిజన్లకు సంబంధించి గురువారం సాయంత్రం 'వై ఏపీ నీడ్స్ జగన్' నిర్వహించారు. రెండు డివిజన్లకు సంబంధించిన సంక్షేమ పథకాల లబ్ధి ప్రచార బోర్డును ఎమ్మెల్యే ద్వారంపూడి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పేదల కష్టాన్ని గుర్తించి ఎన్నో సంక్షేమ పథకాలను అందిస్తున్న ప్రభుత్వం దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఒకప్పుడు పింఛన్ల వంటి ప్రభుత్వ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీలకు ముడుపులు చెల్లించాల్సి వచ్చేదని, ఒక లబ్ధిదారుడు మరణిస్తే తప్ప మరొకరికి న్యాయం చేయలేని దుస్థితి ఉండేదన్నారు. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక అటువంటి విధానాలకు స్వస్తి చెప్పి సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా సొమ్ము జమచేసే విధానాన్ని తీసుకువచ్చారన్నారు. నిరంతరం పేదల అభివృద్ధి సంక్షేమాన్ని ఆకాంక్షించే ముఖ్యమంత్రిని రానున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే చంద్రశేఖర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గడచిన నాలుగున్నర ఏళ్లలో 37, 38 డివిజన్లకు సంబంధించి సుమారు రూ.59 కోట్ల రూపాయల మేరకు సంక్షేమ ఫలాలు అందించమన్నారు.

'బాబు' పేరిట ఒక్క పథకం ఉందా?

ఆంధ్రప్రదేశ్‌కు ఎన్టీఆర్, వైఎస్సార్, చంద్రబాబు, వైఎస్ జగన్ ముఖ్యమంత్రులుగా పని చేశారని, వీరిలో చంద్రబాబు పేరుతో చెప్పుకోవడానికి ఒక్క పథకమైన ఉందా? అని ఎమ్మెల్యే ద్వారంపూడి ప్రశ్నించారు. 14 ఏళ్లు సీఎంగా చేసిన చంద్రబాబు ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, స్వప్రయోజనాలకే ప్రాధాన్యమిచ్చారు తప్ప రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. ఎన్టీఆర్ పేరిట ఇప్పటికీ కిలో రెండు రూపాయలు బియ్యం పథకం, వైఎస్సార్ పేరిట ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, జగన్ పేరిట అమ్మ ఒడి సహా మరెన్నో సంక్షేమ పథకాలు ఉన్నాయన్నారు. నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు మాట్లాడుతూ అర్హత ఉండి ఎవరైనా ప్రభుత్వ పథకాలు అందకపోతే అటువంటి వారిని గుర్తించి పథకాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశం అనంతరం పార్టీ పతాకాన్ని ఎమ్మెల్యే ద్వారంపూడి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ ఇతర నాయకులు ఆవిష్కరించారు. సమావేశంలో కొడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్ పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్ కుమార్, స్మార్ట్ సిటీ మాజీ చైర్మన్ అల్లి రాజబాబు, స్థానిక నాయకులు యార్లగడ్డ రాంబాబు చౌదరి, బాదం మధు, డీకే రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలి

- బీఎల్‌వోలకు ఈఆర్వో ఆదేశం
- పారదర్శక ఓటర్ల జాబితా లక్ష్యంగా పనిచేయాలని పిలుపు


ఈఆర్వో నాగ నరసింహారావు

కాకినాడ: ఓటర్ల సంక్షిప్త సవరణ–2024లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించడంలో బీఎల్‌వోల పాత్ర అత్యంత కీలకమని నియోజకవర్గ ఈఆర్వో, నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు పేర్కొన్నారు. స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణపై గురువారం సాయంత్రం ఏఈఆర్వోలు, బీఎల్‌వోలతో సమీక్షించారు. ఫారం 6, 7, 8 ద్వారా వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి వివరాలు అందజేయాలని ఆదేశించారు. దోష రహిత, పారదర్శకమైన ఓటర్ల జాబితాను రూపొందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు బాధ్యతగా పనిచేయాలని ఆదేశించారు. ఆచూకీ లేని (నాన్ ట్రేస్డ్) ఓటర్లకు సంబంధించి రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా పంపించిన నోటీసుల విషయంలో కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాన్నారు. అర్హత ఉన్న ఏ ఒక్కరూ ఓటు కోల్పోరాదన్నదే ఎలక్షన్ కమిషన్ నిర్ణయం అన్నారు. కొత్త ఓట్ల నమోదుకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను కూడా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో ఏఈఆర్వోలు కోన శ్రీనివాస్, సీతాపతి, మురళీకృష్ణ, హరిదాసు నాగ శాస్త్రులు, జాన్ బాబు, వరహాలబాబు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ప్రజల మనిషి సీఎం జగన్

- ఎంపీపీ శ్రీలక్ష్మి
- కూరాడలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

కరప: అన్ని సామాజిక వర్గాల అభ్యున్నతి కోరుకునే ప్రజల మనిషి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి పేర్కొన్నారు. ప్రజలు ఆనందంగా ఉన్నారంటే ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 96 శాతం నెరవేర్చి, చెప్పకుండానే చేసిన మరికొన్ని సంక్షేమ పథకాలే కారణమన్నారు. అటువంటి మాట తప్పని, మడమ తిప్పని నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా చేసేందుకు అభివృద్ధే ధ్యేయంగా ప్రజలతో మమేకమయ్యే ఎమ్మెల్యే కురసాల కన్నబాబును వచ్చే ఎన్నికల్లో తిరిగి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఎంపీపీ కోరారు. మండలం కూరాడలో గురువారం నిర్వహించిన 'వై ఏపీ నీడ్స్ జగన్'లో ఆమె మాట్లాడారు. గ్రామ సచివాలయం వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులు కలసి వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించి అనంతరం కార్యక్రమ బుక్‌లెట్‌లున్న బ్యాగులను వలంటీర్లకు అందజేశారు. నోడల్ అధికారి, ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు సచివాలయం ద్వారా అందజేస్తున్న ప్రభుత్వ సేవలను, సంక్షేమ పథకాలను వివరించారు. అర్హులై ఉండి పథకాలు రానివారు వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. సర్పంచ్ వాసంశెట్టి వెంకటరమణ (కొండ) మాట్లాడుతూ డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా సచివాలయం పరిధిలో కూరాడ, చినమామిడాడ గ్రామాల్లో రూ.34.46 కోట్లతో చేసిన అభివృద్ధి పనులను వివరించారు. అనంతరం గ్రామ కూడలిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా కన్నబాబును, ముఖ్యమంత్రిగా జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ రావుల ప్రసాద్, మండల కన్వీనర్ కాదా వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, గుత్తుల బాలాజీ, వెలుగుబంటి నారయ్య, చిన్నం వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఎం.చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

చీడిగలో..

కాకినాడ రూరల్: మండలంలోని చీడిగ గ్రామంలో సచివాలయం–2 పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సచివాలయం వద్ద అధికారులు గ్రామ సభ ద్వారా సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలను తెలియజేశారు. డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ.17.65 కోట్లు లబ్ధిదారులకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా అందించిన వివరాలను డిస్‌ప్లే ద్వారా వెల్లడించారు. వైఎస్సార్ సీపీ గ్రామ నాయకుడు కొప్పిశెట్టి గణేష్ డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో చీడిగ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ, నోడల్ అధికారి రామాంజనేయులు, పంచాయతీ సెక్రటరీ రమేష్, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ అనుసూరి ప్రభాకర్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.


కూరాడలో ప్రభుత్వ సంక్షేమపథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు, అధికారులు


డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకుడు కొప్పిశెట్టి గణేష్

చైతన్యవంతంగా గ్రంథాలయ వారోత్సవాలు


రిటైర్డ్ డిప్యూటీ లైబ్రేరియన్ సాయి సత్యనారాయణను సత్కరిస్తున్న పాఠకులు

బాలాజీచెరువు: స్థానిక గాంధీనగర్ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించారు. గ్రంథాలయాధికారి ములంపాక శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విశ్రాంత డిప్యూటీ గ్రంథాలయాధికారి సలాది సాయి సత్యనారాయణ పాల్గొని మాట్లాడుతూ జగనన్న మదిలో మరో కలికితురాయి డిజిటల్ గ్రంథాలయాల అవిర్భావం అని, సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో గ్రంథాలయాలు డిజిటైజ్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. మొదటి విడతగా 6 వేల సచివాలయాల్లో డిజిటల్ గ్రంథాలయాలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సంకల్పించిందని, విద్యార్థులు స్మార్ట్‌ఫోన్‌లు దూరంపెట్టి గ్రంథాలయాల పుస్తక పఠనం ద్వారా జ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. అనంతరం ఆయనను గ్రంథాలయాధికారి, పాఠకులు సత్కరించారు.

జిల్లా గ్రంథాలయంలో..

జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో లైబ్రరీ సైన్స్ జూనియర్ లెక్చరర్ ఎస్.పెద్దిరాజు హాజరై మాట్లాడుతూ చిన్నతనం నుంచి క్రమశిక్షణ, మంచి అలవాట్లు కలిగి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. సాహితీ స్రవంతి అధ్యక్షుడు మార్ని జానకిరామయ్య చౌదరి సమాజ అభివృద్ధిలో గ్రంథాలయాల పాత్ర వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రసాద్, డిప్యూటీ లైబ్రేరియన్ కిశోర్, గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘ అధ్యక్షులు తుమ్మలపల్లి జయకృష్ణ, వెంకటరాము పాల్గొన్నారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

- మూడు డిపోల నుంచి ఏర్పాట్లు
- డీపీటీవో శ్రీనివాసరావు వెల్లడి



కాకినాడ: కార్తికమాసం సందర్భంగా పంచారామాల సందర్శనకు జిల్లాలోని కాకినాడ, తుని, ఏలేశ్వరం డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు చెప్పారు. గురువారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ మూడు డిపోల నుంచి ప్రతి శని, ఆదివారాల్లో రాత్రి ఎనిమిది గంటలకు బస్సులు బయలుదేరతాయన్నారు. అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామ, సామర్లకోటలలో దర్శనం అనంతరం మరుసటి రోజు రాత్రి 8 గంటలకు తిరిగి డిపోకు చేరుతాయన్నారు. ఈ సర్వీస్‌లకు అడ్వాన్స్ రిజర్వేషన్ చేసుకోవచ్చునని తెలిపారు. సరిపడినంత భక్తులు ఉంటే కోరుకున్న ప్రాంతాల నుంచి బస్సులు కూడా నడుపుతామన్నారు. అలాగే శబరిమలై వెళ్ళే భక్తులకు వారి విజ్ఞప్తి మేరకు క్షేత్రాలను చూపించి తీసుకువచ్చేందుకు అద్దె ప్రాతిపదికన బస్సులు ఇస్తామన్నారు. ఇందుకోసం కాకినాడ డిపో మేనేజర్ ఫోన్ నెంబర్ 99592 25534, తుని డిపో మేనేజర్ 99592 25539, ఏలేశ్వరం డిపో మేనేజర్ 99592 25532 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఆరోగ్యకరమైన పంటకే పొలంబడి

- జేడీఏ విజయకుమార్
- నేమాంలో పొలంబడి క్షేత్ర దినోత్సవం


నేమాంలో కోతకు సిద్ధంగా ఉన్న వరిపొలాలను పరిశీలిస్తున్న జేడీఏ విజయకుమార్ తదితరులు

కాకినాడ రూరల్: సాగు పెట్టుబడిని తగ్గించుకుని ఆరోగ్యవంతమైన పంటను పండించేందుకు డాక్టరు వైఎస్సార్ పొలంబడి నిర్వహిస్తున్నట్టు జిల్లా వ్యవసాయ అధికారి (జేడీఏ) ఎన్.విజయకుమార్ పేర్కొన్నారు. మండలం నేమాంలో ఏఓ చీకట్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో సర్పంచ్ రామదేవు సూర్య ప్రకాశరావు అధ్యక్షతన రైతు కొప్పిశెట్టి శ్రీను మకాంలో పొలంబడి క్షేత్ర దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. 14 వారాల పాటు వ్యవసాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో రైతులు నేర్చుకున్న విషయాలు, పెట్టుబడి తగ్గింపు, నాణ్యమైన పంట తదితర అంశాలపై ఏడీఏ పద్మశ్రీ రైతుల అనుభవాలను తెలుసుకున్నారు. పంట కోత ప్రయోగం ద్వారా ఎకరాకు 42 బస్తాలు (75 కేజీలు) చొప్పున దిగుబడి వస్తున్నట్టు అంచనా వేవారు. వైస్ ఎంపీపీ గుత్తుల సత్తిబాబు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు నాగం జగ్గబాబు, వ్యవసాయాధికారులు గాయత్రి, పద్మజారాణి, వ్యవసాయ విస్తరణాధికారి ఏవీ రమణ, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన పరికరాల సేకరణ


ఈఎన్‌టీ భవంతి ఆవరణలో కాలం చెల్లిన పరికరాలు

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో కాలం చెల్లిన పరికరాల తరలింపు జరుగుతోంది. వీటిన్నింటినీ క్రోడీకరించి మలి దశలో బరువు, చివరిగా వేలం వేసి ప్రక్రియను ముగిస్తారు. ఇందులో భాగంగా వివిధ వార్డులు, ఆసుపత్రిలోని కార్యాలయాల నుంచి పాడుబడ్డ పరికరాలను ఈఎన్‌టి భవంతి ఆవరణలోకి తరలిస్తున్నారు. ఈ నెల 25వ తేదీ నాటికి సేకరణ ముగియనుంది. కలెక్టర్ ఆదేశాలతో వేలం నిర్వహించి సమకూరిన మొత్తాన్ని హెచ్‌డీఎస్ ఖాతాకు జమచేయనున్నారు.

ఆలయాల్లో చవితి ఏర్పాట్లు

- తాత్కాలిక పుట్టల నిర్మాణం
- మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు


భానుగుడి సెంటర్‌లో తేగలు, టెంక గుంజు విక్రయిస్తున్న వ్యాపారులు

బోట్‌క్లబ్: నగరానికి నాగులచవితి శోభ వచ్చింది. గురువారం నగరంలోని ప్రధాన కూడళ్లలో తేగలు, తాటి గుంజు, చెరకు ముక్కలు విక్రయించే దుకాణాలు వెలిశాయి. నగరంలోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయాల వద్ద భక్తుల కోసం తాత్కాలికంగా పుట్టలు ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక సినిమారోడ్డులో ఉన్న నాగేంద్రస్వామి ఆలయంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని బారికేడ్లు ఏర్పాటు చేశారు. స్థానిక బాలత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో చవితి వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ కోనేరు వద్ద తాత్కాలికంగా పుట్టలు ఏర్పాటు చేసినట్లు ఈవో చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. స్థానిక భానుగుడి వద్ద నున్న భానులింగేశ్వరస్వామి ఆలయంలోనూ తాత్కాలిక పుట్టలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ వాకాడ వీరవెంకట సత్యనారాయణ (సత్తిబాబు) తెలిపారు. స్థానిక రామారావుపేటలో ఉన్న శివాలయంలోను, దేవాలయం వీధిలో ఉన్న భీమేశ్వరస్వామి దేవస్థానంలోను, బోట్ క్లబ్ వద్ద ఉన్న సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో భక్తులకు ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేశారు. స్థానిక రిజర్వు పోలీస్‌లైన్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో ఉన్న నాగేంద్రుడు, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్లకు ఈ నెల 17, 18, 19 తేదీల్లో నాగుల చవితి, పంచమి, స్కంద షష్టి, సందర్భంగా విశేష అభిషేకాలు, అర్చనలు, హోమాలు జరుగుతాయని ఆలయ పర్సన్ ఇన్‌చార్జి గోపాలకృష్ణ తెలిపారు.

నేటి నుంచి వ్యక్తిత్వ వికాస తరగతులు


ఎంకార్ వర్సిటీ వీసీ కుముయికి స్వాగతం పలుకుతున్న సీవైఎఫ్ డైరెక్టర్ మూర్తిరాజు

కాకినాడ: యువతను చైతన్యవంతం చేసి సన్మార్గంలో నడిపించే దిశగా శుక్రవారం నుంచి 19వ తేదీ వరకు మూడు రోజుల పాటు వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహిస్తున్నట్టు సీవైఎఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బీహెచ్‌వీ మూర్తిరాజు తెలిపారు. స్థానికంగా గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయి యువజన మహోత్సవానికి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఆఫ్రికా ఎంకార్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ కుముయి, మరో సువార్త ప్రసంగీకుడు శామ్యూల్ దినకర్ ముఖ్య అతిథులుగా రానున్నారన్నారు. కాకినాడ మెక్లారిన్ హౌస్కూల్ గ్రౌండ్‌లో జరిగే యూత్ ఫెస్టివల్స్‌లో భాగంగా 18వ తేదీన హీరో ఫ్రం హీరో పేరిట సదస్సు జరుగుతుందన్నారు. ముఖ్య అతిథులుగా సినీనటి జయసుధ, ప్రముఖ గాయని ఎంఎం శ్రీలేఖ, అలెన్‌గంటా, రక్షణ టివి ఎండి బెనహర్, ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కురసాల కన్నబాబు, తదితరులు రానున్నారన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాషువా గిరి, సీవైఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ యువజన మహోత్సవంలో పాల్గొనేందుకు వచ్చిన ఆఫ్రికా ఎంకార్ వర్సిటీ వీసీ కుముయికి సీవైఎఫ్ డైరెక్టర్ మూర్తిరాజు, ఇతర ప్రముఖులు ఘనస్వాగతం పలికారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

బాలాజీచెరువు: సీనియారిటీ ప్రాతిపదికన జేఎన్‌టీయూకే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం వీసీ ప్రసాదరాజుకు వినతిపత్రం అందజేశారు. నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు, జిల్లా కోశాధికారి మలక వెంకటరమణ మాట్లాడుతూ కళాశాల నుంచి వర్సిటీ హోదాకు పెరిగినా కాకినాడ జేఎన్‌టీయూకేలో ఏళ్ల తరబడి వందలాది మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్నారని, ఆప్కాస్‌లో చేర్చే అంశం వర్సిటీకి వర్తించక పోవడం బాధకరమన్నారు. కనీసం టైం స్కేల్ లేదా మరణించిన కుటుంబ సభ్యుల్లో అర్హులకు ఉపాధి కల్పించాలన్నారు. వర్సిటీతో పాటు కళాశాలకు చెందిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరూ ఐక్యతగా ఉంటే సీఐటీయూ వారికి అండగా నిలుస్తుందన్నారు.